20 నాటికి ఇ-పంట నమోదు చేయాలి : జెసి

నరసాపురం: ఖరీఫ్ సాగుకు సంబంధించి ఇ-పంట నమోదును సెప్టెంబర్ 20వ తేదీ నాటికల్లా పూర్తిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జెసి లిఖితపూడి గ్రామంలో ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఇ పంట నమోదు నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి ఇ-పంట నమోదును వచ్చే నెల 20వ తేదీ నాటికి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇ పంట నమోదులో అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఫొటోలు తీసి అప్లోడ్ చేస్తున్న కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ఇ-పంట డిజిటల్ యాప్‌లో వాస్తవ సాగుదారులు పేర్లనే నమోదు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఈదా అనిల్‌కుమారి, తహశీల్దార్ రాజేశ్వరి, ఎఒ శామ్యూల్ జాన్సన్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బిందెడు నీటికోసం.. బారెడు కష్టం..!

ట్యాంకర్‌తో సరఫరా చేస్తున్న మున్సిపల్ అధికారులు

స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లయినా తప్పని దాహార్తి

అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలో ఎంతో ఆనందంగా 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నాం.. అయితే ఎంత ఎదిగినా కనీసం బిందెడు తాగునీరు అందించలేని స్థితిలో ఉన్నామంటే నిజంగా సిగ్గుచేటే.. ఈ తప్పు ఎవరిది, ఎవరు బాధ్యులు అనే దగ్గరే చర్చ పక్కదారి పడుతోంది. దీంతో ప్రజల దాహార్తి ఏళ్లతరబడి తీరడం లేదు. ప్రజలకు రక్షిత నీటిని అందించేందుకు పెద్దఎత్తున ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు. వీటి నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే గత ప్రభుత్వం వల్ల ఏర్పడిన అన్ని సమస్యలనూ పరిష్కరించి పాలనలో మార్పు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులకు అవేవీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అడిగినా పట్టించుకునే వారే లేరంటూ మహిళలు వాపోతున్నారు. దీంతో భీమవరం పట్టణంలో మహిళలు బిందెలతో రోడ్డు వెంబడి పరుగులు తీస్తున్నారు. ఇటీవల తాగునీటి కోసం లంకపేట మహిళలు రోడ్డెక్కారు. తాగునీరు ఇప్పించండి మహాప్రభో అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు (ఫైల్‌ఫొటో)

భీమవరం పట్టణంలో కొందరు అధికారుల నిర్లక్ష్యం ప్రజా సమస్యలకు కారణమవుతోంది. ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యమేనని పట్టణ ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మున్సిపల్ ఉన్నతాధికారి క్షేత్రస్థాయి పర్యటనలు పెద్దగా చేపట్టకపోవడంతో దిగువస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంపై పలు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ నెల 12వ తేదీ నుంచి టుటౌన్ మొత్తం, వన్‌టౌన్‌లోని 11వ వార్డు నుండి 26వ వార్డు వరకూ నీటి సరఫరా లేదు. ట్యాంకర్లతో కొంతమేర అందించినప్పటికీ పూర్తిస్థాయిలో నీరందక ఆయా ప్రాంతాల ప్రజలు నానావస్థలు పడ్డారు. అటు తాగడానికి, ఇటు వాడుకోవడానికి చుక్క నీరు లేక మహిళలు చుట్టుపక్కల బోర్లు ఎక్కడున్నాయి, చెరువులు ఉన్నాయా అంటూ ఖాళీ బిందెలతో రోడ్డు వెంబడి పరుగులు తీస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడో ఒకచోట పైపు లీకేజీ వస్తే మొత్తం వన్‌టౌన్ అంతటికీ నీటిని నిలిపేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్య ఫలితమే ఈ పరిస్థితి అనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రాంతాలవారీగా అవసరమైన చోట సెక్షన్ వాల్ ఏర్పాటు చేసి ఉంటే ఎక్కడైనా పైపు లీకేజీ వచ్చినప్పుడు, ఆ పనిలో ఉన్న వాల్ ఆఫ్ చేసి మిగతా ప్రాంతానికి నీటిని సరఫరా చేసే విధంగా ఏర్పాటు చేయకుండా తమను ఎందుకిలా ఇబ్బంది పెడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులంతా ఉండి కూడా పట్టణంలో ఇన్ని రోజుల నుంచి నీరు రాకపోవడం, ఎవరూ పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పాలకొల్లు : శ్రీరామ్మూర్తి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న బలరాం, రాజగోపాల్, శ్రీనివాస్, నేతలు

ఏలూరు : భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంతెన సీతారాం, రవి, బాబూరావు, నరసింహారావు, నేతలు

ఉద్యమాల ముద్దుబిడ్డ శ్రీరామ్మూర్తి ఇక లేరు

ఉపాధ్యాయ, రైతు ఉద్యమంలో కీలక పాత్ర

తుదిశ్వాస విడిచే వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఆశ్రం ఆసుపత్రికి భౌతికకాయం అప్పగింత

వలవల శ్రీరామ్మూర్తి(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పాలకొల్లు

సిపిఎం సీనియర్ నేత వలవల శ్రీరామ్మూర్తి (90) శనివారం ఉదయం కన్నుమూశారు. ఆయన వారం రోజుల క్రితం అస్వస్థతకు గురవ్వడంతో రాజమండ్రిలోని ప్రయివేట్ హాస్పిటల్‌లో చేరారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని శనివారం మధ్యాహ్నం పాలకొల్లులోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. ఆయనకు ఇరువురు కుమారులు, అల్లుడు ఉన్నారు. వలవల శ్రీరామ్మూర్తి చనిపోయేవరకు ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన ఉపాధ్యాయులుగా సుమారు 25 సంవత్సరాలు పని చేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా పని చేశారు.

జిల్లాలో యుటిఎఫ్, రైతు ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన ఇక లేరంటే నమ్మలేకపోతున్నామని పలువురు కార్యకర్తలు కన్నీటిపర్యంతమయ్యారు.

ఆయన భౌతికకాయాన్ని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, సిపిఎం, ప్రజాసంఘాల నేతలు, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పట్టణ ప్రధాన రోడ్డు గుండా హౌసింగ్ బోర్డు శివారు వరకు అంతిమయాత్ర నిర్వహించారు. యాత్రలో ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటిరాజగోపాల్, జవ్వాది శ్రీనివాస్, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

భీమవరం: ఉద్యమాల ముద్దుబిడ్డ వలవల శ్రీరామ్మూర్తి (90) మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తిగా.. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రధాన భూమిక పోషించిన శ్రీరామ్మూర్తి మరణం అందరినీ కలిచివేసిందని పేర్కొన్నారు. 1935లో వలవల శ్రీరామ్మూర్తి జన్మించారు. ఉపాధ్యాయునిగా పని చేసిన ఆయన అభ్యుదయ భావాలు, సోషలిస్టు చైతన్యంతో జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించారు. యుటిఎఫ్ జిల్లా ముఖ్య బాధ్యతలు నిర్వర్తించారు. కమ్యూనిస్టు అగ్రనేతలైన ఉద్దరాజు రామం, అల్లూరు సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్), ఎస్ఆర్.పోలిశెట్టి వంటి నాయకుల స్ఫూర్తితో సిపిఎం సభ్యత్వం పొందారు. పార్టీ అవసరాల మేరకు నాయకత్వం కోరిన వెంటనే 1984లో ఉద్యోగం నుండి వైదొలిగి పార్టీ పూర్తికాలం కార్యకర్తగా బాధ్యతలు చేపట్టారు. సిపిఎం నరసాపురం డివిజన్ కార్యదర్శిగా, రైతుసంఘం జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎంతోకాలం పని చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వర్తించారు. సాహితీమిత్రులందరినీ సమీకరించి సాహితీస్రవంతి నిర్మాణానికి పూనుకున్నారు. ప్రజాశక్తి, మార్క్సిస్టు, రైతువాణి, ఐక్య ఉపాధ్యాయ పత్రికల చందాల చేర్పింపునకు విశేష కృషి చేశారు. వయస్సు మీద పడినా చివరి వరకు ఎంతో అంకితభావంతో పార్టీ కోసం పరితపించారు. పార్టీ, రైతుసంఘం నిర్వహించిన పలు ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేశారు. అనేక సందర్భాల్లో పార్టీకి, రైతు-ప్రజా సంఘాలకు భూరి విరాళం అందించడంలో ప్రముఖ భూమిక పోషించారు. శ్రీరామ్మూర్తి భార్య, కుమార్తె మరణించినప్పటికీ కుంగిపోకుండా మనోధైర్యంతో ముందుకు సాగడమే కాకుండా దృఢంగా ప్రజాఉద్యమాలను ముందుకు నడిపించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని, ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ ప్రతినబూనాలని బలరాం పిలుపునిచ్చారు.

ధన్యజీవి శ్రీరామ్మూర్తి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ఏలూరుఅర్బన్: సిపిఎం ఉమ్మడి జిల్లా పూర్వ కార్యదర్శివర్గ సభ్యులు, రైతుసంఘం నేత వలవల శ్రీరామ్మూర్తి ధన్యజీవి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కొనియాడారు. శ్రీరామ్మూర్తి శనివారం ఉదయం రాజమండ్రిలోని ఒక ప్రయివేటుయ ఆసుపత్రిలో మరణించారు. అనంతరం అక్కడే నేత్రదానం పూర్తి చేసి భౌతికకాయాన్ని స్వగ్రామం పాలకొల్లు తీసుకొచ్చారు. అక్కడ పలువురు నివాళులు అర్పించిన అనంతరం శనివారం రాత్రి ఏలూరు ఆశ్రం కాలేజీకి తరలించి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు వైద్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు జిల్లాయ కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగిన సంతాపసభలో మంతెన సీతారాం మాట్లాడుతూ చివరివరకు ప్రజలు, పార్టీ కోసం పనిచేసిన ధన్యజీవి శ్రీరామ్మూర్తి అని అన్నారు. ప్రజా ఉద్యమాల్లో ఫలితం వచ్చేదాకా పనిచేయటంలో శ్రీరామ్మూర్తి ఎనలేని కృషి చేశారన్నారు. సభలో పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు తదితరులు మాట్లాడారు. సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్, రైతు, వ్యవసాయకార్మిక, ఐద్వా జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, ఎ.శ్యామలారాణి, వివిధ ప్రజా సంఘాల జిల్లా నాయకులు జివిఎల్.నరసింహారావు, పివి.నరసింహారావుతోపాటు శ్రీరామ్మూర్తి కుమారులు, మనుమడు, బంధువులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పకడ్బందీగా తయారుచేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావు

ప్రజాశక్తి - భీమవరం

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లో డిఆర్‌ఒ విద్యాశాఖ, అన్ని పాఠశాల సంఘాలతో సమావేశం నిర్వహించి ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు - పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్లు జాబితా షెడ్యూల్ ప్రకారం ఫారమ్ -18 లేదా 19లో దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ సెప్టెంబర్ 3 గడువుగా ఉందన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ముసాయిదా ప్రచురణ సెప్టెంబరు 24వ తేదీ అని, క్లెయిమ్‌లు అభ్యంతరాలకు గడువు సెప్టెంబరు 24 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకూ నిర్ణయించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ అనంతరం జాబితాలు నవంబర్-1 తాజాగా సిద్ధం చేయాలని, తుదిజాబితా నవంబర్ 6న ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల జిల్లా రెవెన్యూ అధికారులను ఎఆర్‌ఒఎస్‌లుగా నియమించినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలల అధ్యాపకులు ఓటు నమోదుకు అర్హులన్నారు. నిర్ణీత ఫారంలో ఓటు నమోదుకు పూరించిన అనంతరం ఆధార్, సర్వీస్ సర్టిఫికెట్, డిడిఒ ధ్రువీకరణ సంతకం చేరికలతో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డివైఇఒ ఎన్.శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ జనరల్ కార్యదర్శి పివిఎస్ ఎస్‌బి.రమణారావు, ఎపియుటిఎఫ్ జనరల్ సెక్రటరీ ఎకెవి.రామభద్రం, ఏపి పెట్ అండ్‌ఎస్‌పిఇ కార్యదర్శి ఎమ్‌డి. ఖుద్దూస్, పిఆర్‌టియు సిహెచ్ ఈశ్వరరావు, ఉపాధ్యాయ సంఘం జనరల్ సెక్రటరీ సిహెచ్ ఫణికుమార్, టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రకాశం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉదయభాస్కరరావు

హత్యాచారానికి వ్యతిరేకంగా నిరసనల వెల్లువ



నరసాపురంలో వైద్యులకు సంఘీభావం తెలిపిన నాయకర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కొల్‌కత్తాలోని ఒక హాస్పిటల్లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా ఐఎంఎ ఆధ్వర్యాన పట్టణంలోని ప్రముఖ ప్రైవేట్ హాస్పటల్స్‌కు చెందిన డాక్టర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఆచంట: కొల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్, వేమవరం, వల్లూరు పిహెచ్‌సిల వైద్యాధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఆచంట కచేరి సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.సుగుణసంధ్యకు వైద్యాధికారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ శివరంజని, మాట్లాడగా వైద్యాధికారులు జితేంద్ర, రమ్యశృతి, ఉమాశంకర్, రామాంజనేయులు, పి.పావని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ: జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఐఎంఎ ఆధ్వర్యాన మెయిన్ బజార్ దగ్గర నుండి గాంధీబొమ్మల సెంటర్ వరకు వైద్యులు నిరసన ప్రదర్శన చేపట్టారు.

నరసాపురం: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని నరసాపురం ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి గేటు బయట సంతాప సభ నిర్వహించారు. మిషన్ హైస్కూల్ రోడ్డులో ర్యాలీ చేపట్టి ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వాసుపత్రిలో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎంఎల్‌ఎ సానుకూలంగా స్పందించారు.

నరసాపురంలోని ప్రయివేటు వైద్యులు నిరసన ప్రదర్శన చేపట్టారు. దీనిలో భాగంగా ఓపి వైద్య సేవలు నిలిపివేశారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనకు ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మద్దతు తెలిపి, కాసేపు వైద్యులతో నిరసన ప్రదర్శనలో ముందుకు సాగారు.

ఉండి: స్వాతంత్ర భారతదేశంలో స్త్రీకి రక్షణ కరువైందని ఉండి పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ పి.లక్ష్మి సునంద, యండగండి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బిన్నీ శామ్యూల్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉండి, యండగండి పిహెచ్‌సిల వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా స్థానిక పిహెచ్‌సి నుంచి ఉండి మెయిన్ సెంటర్ వరకు, యండగండి పిహెచ్‌సి నుంచి మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.లక్ష్మిసునంద, డాక్టర్ బిన్నీ శామ్యూల్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారులు ఆర్.కృష్ణకుమార్, రత్నరాజు, సిబ్బంది కుమారి, తదితరులు, యండగండి జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకు: ఆసుపత్రుల్లో వైద్యసేవలందిస్తున్న వైద్యుల రక్షణకు కల్పించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని తణుకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.అరుణ అన్నారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ శనివారం ర్యాలీగా నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. తహశీల్దార్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో పోలీస్ ఔట్‌పోస్టులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో తణుకు ప్రభుత్వాసుపత్రి వైద్యులు కె.శారద ప్రసన్న, కెవి.శ్రీలక్ష్మి, రాజరాజేశ్వరి,

తణుకులో..

తాడేపల్లిగూడెంలో..

సాయిబాలాజీ, శ్రీరాజ్, కీర్తి, దుర్గామహేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలని స్థానిక ఆదర్శ లయన్స్ క్లబ్, ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేశారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, వైద్యులు స్థానిక మాదివాడ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ నాగబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు కాకర్ల రాజరాజేశ్వరి, మాజీ అధ్యక్షులు అహ్మద్, ఉద్దరాజు శ్రీనివాస్, ఎం.సీతారామయ్య, డాక్టర్ నజ్వేనా నజ్రిన్, డాక్టర్ రాజేష్‌రెడ్డి, డాక్టర్ చైతన్య, డాక్టర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం టౌన్: వైద్యులపై హింసకు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాన్ని కేంద్రం పకడ్బందీగా అమలు చేయాలని, ఆసుపత్రులను సేఫ్ జోన్లుగా ప్రకటించాలని ఐఎంఎ భీమవరం శాఖ అధ్యక్షులు డాక్టర్ జి.బాలకృష్ణంరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.శంకర్‌కుమార్‌వర్మ, రాష్ట్ర యాక్షన్ కమిటీ సభ్యురాలు డాక్టర్ ఎంవి.స్వరాజ్యలక్ష్మి అన్నారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలో వైద్యులు వైద్య సేవలను నిలిపివేసి నిరసన తెలిపారు. స్థానిక లీలాకృష్ణ గ్రాండ్ వద్ద పట్టణానికి చెందిన వైద్యులు క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. జూనియర్ డాక్టర్ కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు బాలమురళీకృష్ణ, జి.సూర్యనారాయణరాజు, యిర్రింకి లక్ష్మి, జి.సుభాష్, యిర్రింకి సూర్యనారాయణరావు, జి.గోపాలరాజు, యిర్రింకి నరేష్‌కుమార్, నరసవాణి, శ్వేత, పి.లక్ష్మి ప్రత్యూష, వి.శ్రీరమ్య అమూల్య, కె.ప్రభాకర్, ఎన్.రాజేష్, జె.కరుణకుమార్, సిహెచ్.సాయిబాబు, యువి.రమణరాజు, వి.రామకృష్ణంరాజు, జి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆకివీడులో..

భీమవరం టౌన్: నిరసన తెలుపుతున్న దృశ్యం

ఆకివీడు: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ఐఎంఎ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ నిరసనకు టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి, సిపిఎం నేతలతోపాటు ఐద్వా, డివైఎఫ్ఐ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు, ఆదర్శ లయన్స్ క్లబ్, అభయ లయన్స్ క్లబ్, ఆక్వా గోల్డ్ లయన్స్ క్లబ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు, సేవా సంస్థలు విద్యా వికాస్ కళాశాల విద్యార్థులు ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఐఎంఎ నాయకులు ఎంవి.సూర్యనారాయణరాజు, ఎమ్‌డి.బిలాల్, మహేష్‌వర్మ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నుండి ఎస్.టర్నింగ్ వరకు నిరసన నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఎస్ టర్నింగ్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, ఎమ్‌డి.మదని, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కంభంపాటి నరసింహ, ఆదర్శ లయన్స్ అధ్యక్షులు కె.రాజరాజేశ్వరి, సిపిఎం మండల కార్యదర్శి కె.తవిటినాయుడు, ఐద్వా నాయకులు డి.కళ్యాణి, సందక ఉదయకుమారి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వీరవాసరం: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్‌ఎంపి, పిఎంపిలు డిమాండ్ చేశారు. మండలస్థాయిలోవారు శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోను సూర్యనారాయణ, గోపా సురేష్, దేవ రామకృష్ణ, చీడే సురేష్, రాజు, శివ, సత్తార్, బొక్కా సూర్యనారాయణ, కెవిఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఐద్వా నేతలు

వైద్యుల ఆందోళనకు సంఘీభావంగా..

ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన భారీ ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం

కొల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ, దేశవ్యాప్తంగా వైద్యులు చేపట్టిన ఆందోళనలకు సంఘీభావం తెలుపుతూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండు నుంచి ప్రకాశం చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జస్టిస్ ఫర్ జూనియర్ డాక్టర్, మహిళపై అత్యాచారాలను అరికట్టాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రకాశం చౌక్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యార్థినుల కమిటీ కన్వీనర్ చిన్నం శాంతి అధ్యక్షత వహించగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ మాట్లాడారు. కొల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం అత్యంత దారుణమన్నారు. చట్టాలున్నా మహిళపై అఘాయిత్యాలు ఆగడం లేదన్నారు. శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ దేశం నివ్వెరపోయేలా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవన్, గణేష్ మాట్లాడుతూ దేశంలో నిర్భయ ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షులు పవన్, మాజీ జిల్లా అధ్యక్షులు కె.సూర్య, పి.వాసు, గర్ల్స్ కన్వీనర్ సింధు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో..

అన్న క్యాంటీన్లకు దాతల సాయం అద్వితీయం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పేదలకు పట్టెడన్నం పెట్టిన అన్నా క్యాంటీన్లు తిరిగి పున్నప్రారంభమయ్యాయని, అన్నా క్యాంటీన్లకు దాతలు అందిస్తున్న సహకారం అద్వితీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పట్టణంలోని ఎఎస్ఆర్ నగర్‌కు చెందిన చింతలపాటి విజయలక్ష్మి శనివారం అన్నా క్యాంటీన్ నిర్వహణకు రూ.10 వేల ఆర్థిక సహకారం అందించారు. విజయలక్ష్మిని ఎంఎల్ఎ అంజిబాబు అభినందించారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణకు ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వాలని ఎంఎల్ఎ తెలిపారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో కొత్తపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల అభివృద్ధికి స్థానిక జనసేన నాయకులు రూ.పది వేల చెక్కు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దాల వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఆ సొమ్ముతో గ్రానైట్ మెటల్ చిప్స్ వేయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జనసేన గ్రామ అధ్యక్షులు మద్దాల లక్ష్మీరమేష్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి జనసైనికులు ముందు భాగంలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మద్దాల రత్నకుమారి, మధుసూదనరావు, ఎంపిటిసి మద్దాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌సిసికి శశి ఇంజినీరింగ్ విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక శశి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులకు శారీరిక, రాత పరీక్ష, భౌతిక పరీక్షలు నిర్వహించి ఎన్‌సిసి శిక్షణకు ఎంపిక చేసినట్లు 19 ఆంధ్ర బెటాలియన్ నాయబ్ సుబేదార్ లింబో, బెటాలియన్ హవల్దర్ సమధన్ తెలిపారు. ఈ ఎంపిక పరీక్షలు కళాశాల ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ పిఎస్.శేఖర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. బాలురు 19 మంది, బాలికలు 15 మంది ఎంపికైనట్లు తెలియజేశారు. కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ ఎన్‌సిసిలో చేరడం వల్ల సేవాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఐక్యమత్య భావన, దేశభక్తి కలుగుతుందన్నారు. ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపల్ ఎమ్‌డి ఇస్మాయిల్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అభినందించారు.

హెడ్ కానిస్టేబుల్‌కు అవార్డుపై హర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్థానిక పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ముమ్మిడివరపు ఏసుపాదంకు స్వాతంత దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ అవార్డు లభించడం పట్ల పలువురు అభినందించారు. పనిచేసిన ప్రతి చోటా స్థానికుల మన్ననలు అందుకొనే ఏసుపాదంకు ఈ అవార్డు రావడం సమంజసమని తెలిపారు.

విరాళం అందజేస్తున్న సిఐటియు నేతలు

వయనాడ్ బాధితులకు సిఐటియు విరాళం

ప్రజాశక్తి - తణుకు

నెల్లూరు జిల్లాలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా 'వయనాడ్ బాధితులకు సిఐటియు గోదావరి జిల్లా కమిటీ నుంచి రూ.45 వేలను ఆల్ ఇండియా అధ్యక్షులు హేమలతకు అందజేశారు. విరాళాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, బి.వాసుదేవరావు పాల్గొన్నారు. సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ సిఐటియు తరపున ధన్యవాదములు తెలియజేశారు.

క్రీడాకారిణి జ్యోతికశ్రీకి సత్కారం

ప్రజాశక్తి - తణుకు

ఇటీవల పారిస్‌లో జరిగిన 2024 ఒలింపిక్స్‌లో తణుకుకు చెందిన దండి శ్రీనివాసరావు కుమార్తె జ్యోతికశ్రీ అథ్లెటిక్స్ 4 ఇన్‌టు 400 మీటర్స్ రిలేలో పాల్గొనడం సంతోషకరమని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం తణుకు క్యాంపు కార్యాలయంలో జ్యోతికశ్రీని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టి కష్టపడి అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో విజయాలను సాధించి ఒలింపిక్స్ స్థాయికి వెళ్లడం అభినందనీమన్నారు. ఎన్నో విజయాలను సాధించిన జ్యోతికశ్రీ భవిష్యత్తులో మరింతగా రాణించాలన్నారు. దానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం కావాలన్నా చేయడానికి సహకరిస్తామన్నారు. జ్యోతికశ్రీని స్ఫూర్తిగా తీసుకుని యువత రాణించాలన్నారు.

విద్యార్థులతో ఆధ్యాపకులు

పెన్నాడ విద్యార్థులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పాలకోడేరు

పెన్నాడ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు విష్ణు ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శనివారం కిరణ్ గడియన్స్ తో పాటు వివిధ అంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆధ్యాపకులు సిహెచ్.అనూష, జి.అమూల్య, సిహెచ్.వీణ ధార, బివి.ప్రశాంతి, పి.కృష్ణమాధురి, వై.శ్యామలా మాధురి, హుస్సేన్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ ఎం.వేణు, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మిని, కళాశాల మేనేజ్మెంట్‌ను, సిఎస్ సిహెచ్‌ఒ డి ఆర్.శ్రీనివాస్‌ను అభినందించారు.

బంగారయ్యకు అవార్డు

ప్రజాశక్తి - ఆకివీడు

సుమారు దశాబ్దకాలంపైబడి వృద్ధుల సంఘం నాయకుడిగా ఉన్న ఆకివీడు సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్యకు మరోసారి జిల్లాస్థాయి అవార్డు లభించింది. వృద్ధుల సంక్షేమం కోసం ఈ సంఘం ద్వారా చేపడుతున్న పలు కార్యక్రమాలకు గాను బంగారయ్యకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బంగారయ్యను మంత్రి రామానాయుడు, జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా అవార్డు పొందినట్లు బంగారయ్య విలేకరులకు తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - తణుకు

కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రయిమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తణుకు మండలం యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కేన్సర్ బారిన పడి 3వ స్టేజ్, 4వ స్టేజ్ వచ్చే వరకూ తెలుసుకోలేక అనేకమంది మరణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దొమ్మేటి వెంకట సుధాకర్, తాడిపూడి మారుతీరావు, పిఎంపిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చిన్నారి వైద్యానికి రూ.10 వేలు సాయం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం జనసేన మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గల్ఫ్ జనసేన కమ్యూనిటీ గ్రూప్ సహకారంతో ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో భీమవరం మెంటేవారితోటకు చెందిన ఎస్‌కె.సుభాని, ఎమ్‌డి సుఫీనా దంపతుల బిడ్డకు వైద్య నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో గల్ఫ్ జనసేన కమ్యూనిటీ గ్రూప్ రాష్ట్రంలో ఆపదలో ఉన్నవారికి సహాయం అందించడం గొప్ప విశేషమన్నారు. జనసేన మండల అధ్యక్షులు మోక శ్రీనివాస్ మాట్లాడుతూ గల్ఫ్ జనసేన కమ్యూనిటీ గ్రూప్ ప్రతినెలా రూ.50 వేలు సహకారం అందిస్తోందని, దీనిలో భాగంగా పసిబిడ్డ వైద్యం నిమిత్తం రూ.10 వేలు సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, బాపిరాజు, కొల్లాటీ నరసింహస్వామి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

15 నాటికి ఇ - పంట నమోదు పూర్తిచేయాలి

ఆచంట:మండల విఆర్‌ఒలు రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జులు సెప్టెంబర్ 15వ తేదీ నాటికి ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.సుగుణ సంధ్య అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలు రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జులకు ఇ-పంట నమోదుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో విఆర్‌ఒలు రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జులు, సాగుదారులను గుర్తించి ఇ - పంట నమోదును వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి బి.నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి రాజ్యలక్ష్మి, ఆర్ఐ జయలలిత, విఆర్‌ఒలు, రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

పెనుమంట్ర :మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు, వరదలకు నష్టపోయిన పంట నమోదు గురించి శనివారం క్షేత్రస్థాయిలో తహశీల్దార్ వై.రవికుమార్, వ్యవసాయాధికారి జ్యోషిలా సమక్షంలో పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రైతులు ఇ-పంట నమోదు చేయించుకోవాలన్నారు.

20 నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు : ఎంపిడిఒ

పెనుమంట్ర:మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకూ ఆయా గ్రామ పంచాయతీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపిడిఒ పి.పద్మజ శనివారం తెలిపారు. ఈ మేరకు 20వ తేదీన పోలమూరు, సోమరాజు ఇల్లింద్రపర్రు, నెగ్గిపూడి పంచాయతీల్లో 21న మాముడూరు, మల్లిపూడి, మార్టేరు-2లో, 22న నత్తారామేశ్వరం, జుత్తిగ, వెలగలేరులో, 23న పెనుమంట్ర-2, ఆలమూరు, సత్యవరంలో, 24న భట్లమగుటూరు, ఓడూరు, నెలమూరు పంచాయతీల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయని, ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

విద్యార్థి చదువుకు చేయూత

తణుకు:అత్తిలి మండలం కె.సముద్రపు గట్టు గ్రామానికి చెందిన విద్యార్థి చేబ్రోలు బసవయ్య ఐఐటి లక్నోలో ఎంఎస్‌సి డేటా సైన్స్ కోర్సు చేసేందుకు ఆర్థిక సమస్య కారణంగా ఇటీవల ట్విట్టర్ ద్వారా ఐటి మంత్రి నారా లోకేష్‌ను సహాయం కోరాడు. వెంటనే లోకేష్ స్పందించి బసవయ్యకు నాలుగు సెమిస్టర్లకు రూ.4 లక్షలకు గాను మొదటి సెమిస్టర్‌కు రూ.లక్షా 16 వేల సాయం శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ సహాయం కోరిన ప్రతి ఒక్కరికీ లోకేష్ అండగా నిలుస్తున్నారని, ప్రభుత్వం నుంచి మాత్రమే కాకుండా వివిధ మార్గాల ద్వారా అనేక మందికి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. బసవయ్య ఉన్నత స్థానాలకు చేరుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దొమ్మేటి వెంకట సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.



ప్రతిభా విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రవిశర్మ

దేశం గర్వించేలా వినూత్న పరిశోధనలు చేపట్టాలి

ఘనంగా ఎపి నిట్ 6వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశం గర్వించేలా వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలు చేపట్టాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్సు ఛైర్మన్, ఐఐటి అల్యూమిని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి శర్మ విద్యార్థులకు సూచించారు. నిట్ 6వ స్నాతకోత్సవాన్ని ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవిశర్మ మాట్లాడుతూ డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ఐటి ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానం, నైపుణ్యాలు వారు జీవితంలో ముందడుగు వేయడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికతలు ఆవిష్కృతం అవుతున్నాయని, వాటిలో మెలకువలు నేర్చుకుని పట్టు సాధించిన వారు అగ్రస్థానాల్లో నిలదొక్కుకుంటారన్నారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ బిఎస్.మూర్తి మాట్లాడుతూ పరిశోధన, అభివృద్ధికి పెద్దపీట వేసినప్పుడే విద్యార్థులైనా దేశాలైనా పురోగతిలో పయనిస్తాయని తెలిపారు. తమ విద్యార్థులు చదువుతోపాటు పలు క్రీడల్లో రాణించి పతకాలను అందుకోవడం, గేట్ పరీక్షల్లో మంచి ర్యాంకులతో సత్తాచాటడం అభినందనీయమని కొనియాడారు. ముందుగా 2020 -24గాను బిటెక్ నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసుకున్న 527 మంది విద్యార్థులకు, రెండేళ్ల ఎంటెక్ కోర్సు పూర్తి చేసిన 15 మంది విద్యార్థులకు డిగ్రీలు, 25 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. 8 కోర్సులకు గాను అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు, 2020- 24 బ్యాచ్‌లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించి ఇనిస్టిట్యూట్ టాపర్‌గా నిలిచిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సలాడి వెంకట శశిభూషన్ (9.83)కు అదనంగా మరో బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, డీన్‌లు జిఆర్‌కె.శాస్త్రి, టి.కురుమయ్య, వీరేష్ కుమార్, ఎన్.జయరామ్, కార్తీక్ శేషాద్రి పాల్గొన్నారు.

కల్వర్టు పరిశీలన

నరసాపురం:పట్టణం, మెయిన్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మిస్తున్న సిసి కల్వర్ట్ పనులను శనివారం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పనులను నాణ్యతా లోపం లేకుండా చేయాలన్నారు. ఆయన వెంట జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, గుబ్బల మార్రాజు పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఆకివీడు

సిపిఎం నేత వలవల శ్రీరామ్మూర్తి మృతి పార్టీకి తీరని లోటు అని సిపిఎం ఆకివీడు పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి వరకూ పార్టీ ఆశయాలకు కట్టుబడి పనిచేసి, సిపిఎం సిద్ధాంతాలకు అనుగుణంగా నడిచిన గొప్ప పోరాట యోధుడు శ్రీరామ్మూర్తి అన్నారు. ఉద్యమం కోసం ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసిన అసాధారణ వ్యక్తి శ్రీరామ్మూర్తి అన్నారు. యుటిఎఫ్, రైతు సంఘాలకు నాయకత్వం వహించి అనేక రాజీలేని పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో పెంకి.అప్పారావు, డోకల.రవితేజ, బొడ్డుపల్లి రాంబాబు, బివి.వర్మ, గోపిశెట్టి.రాంబాబు, సందక.సూరిబాబు షేక్ వల్లి, కందాల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఆర్థిక స్థోమత లేనివారికి ఉచిత న్యాయవాది

ప్రజాశక్తి - తణుకు

రిమాండ్ ముద్దాలు న్యాయవాదులను పెట్టుకునే స్థోమత లేకపోతే మండల న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రంజిత్ కుమార్ సూచించారు. నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు ఆయన తణుకు సబ్ జైలులో శనివారం జైలు అదాలత్ నిర్వహించారు. ముద్దాయిలకు అందుతున్న ఆహార, వసతి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ న్యాయవాది ఉన్నారా లేరా అని అడిగి తెలుసుకున్నారు. ఒకవేళ ఎవరైనా న్యాయవాదిని పెట్టుకొనే స్తోమత లేకపోతే కోర్టు ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, చింతపల్లి నాగేశ్వరరావు, అజయ్‌కుమార్, తిర్రె సత్యనారాయణ రాజు, పైడి ధనుంజయ్, జైలు సూపరింటెండెంట్ జి.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : ముద్దాయిలు కూడా జైల్ అదాలత్ ద్వారా తమ కేసులను రాజీ చేసుకోవచ్చని అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం నరసాపురం ఉప కారాగారాన్ని జడ్జి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ముద్దాయిల కేసు వివరాలు, వారి ఆరోగ్యంపై, ఉచిత న్యాయవాదులు అందించే న్యాయ సేవలపై ఆరా తీశారు. సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కూడా ముద్దాయిల కేసులు పరిష్కరించు కోవచ్చన్నారు. కార్యక్రమంలో జైల్ విజిటింగ్ లాయర్ కె.శిరీష, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సిహెచ్.వెంకటేశ్వరరావు, పిఎల్‌విడి.వరలక్ష్మి, ఉప కారాగారం పర్యవేక్షణ అధికారి

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఆచంట

18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న బాలికలు, 21 సంవత్సరాలు కంటే తక్కువ వయసున్న బాలురులకు వివాహం చేస్తే కఠిన చర్యలు తప్పవని పెనుమంట్ర సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిడిపిఒ కృష్ణకుమారి అధ్యక్షతన బాల్య వివాహాల నిషేధ చట్టం 2006పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేస్తే రెండేళ్లపాటు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.నరసింహప్రసాద్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.సుగుణ సంధ్య, ఇఒపిఆర్‌డి టి.మూర్తిబాబు, పి.మమతాశ్రీ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆదర్శంగా నిలవాలి : ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

జర్నలిస్టులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం ఎపియుడబ్ల్యూజె 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని రుస్తుంబాద లెప్రసీ కాలనీలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రామ సర్పంచి బందెల భారతి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ విలేకరులు కూడా అనేక సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటారన్నారు. ఎపిజెడబ్ల్యూజె ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్నదానం చేయడం అభినందించదగ్గ విషయన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి వర్మ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టియు నేతలు

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పిఆర్‌విఎస్.సాయి వర్మ డిమాండ్ చేశారు. ఎస్‌టియు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉప కార్యని ర్వాహణాధికారి ఎస్. నిర్మలాజ్యోతి, ముఖ్య కార్యనిర్వహణాధికారి కెఎస్ఎస్.సుబ్బారావును శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఏర్పడిన అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల నుంచి పిఎఫ్ బ్యాలెన్స్ షీట్‌లో ఆన్‌లైన్లో లేకపోవడంతో ఉద్యోగుల ఉపాధ్యాయులు కట్టిన సొమ్ము జమ అయ్యిందో లేదో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. బ్యాలెన్స్ షీట్లో మిస్లెడిట్స్ తెలుసుకుని, నమోదు చేయడం ఇబ్బందిగా మారిందన్నారు. అలాగే పిఎఫ్.ఖాతాలో సొమ్ము ఎప్పటికప్పుడు జమ చేయించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనేక సమస్యలను ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారని తక్షణం వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

భీమవరంలో కెనరా రీజనల్ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బ్యాంకింగ్ సేవలు ఎంత విస్తరిస్తే గ్రామాల సైతం ఆ స్థాయిలో అభివృద్ధి సాధిస్తాయని కెనరా బ్యాంకు ఎమ్‌డి, సిఇఒ సత్యనారాయణ రాజు అన్నారు. జువ్వలపాలెం రోడ్‌లోని కెనరా రీజనల్ బ్యాంక్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఖాతాదారులకు సమయం వథా కాకుండా సేవలందించే విధంగా తమ బ్యాంకు పని చేస్తున్నోందన్నారు.

విద్యార్థులు దేశానికి సేవ చేయాలి : లక్ష్మీనారాయణ

భీమవరం టౌన్:విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తయారై దేశానికి సేవ చేయాలని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చినఅమిరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అనురాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, దేశ నాయకుల ప్రేరణతో విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా దేశానికి సేవ చేయాలన్నారు. పాఠశాల గ్రంథాలయాల అభివృద్ధికి 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బుద్ధరాజు శ్రీనివాసరాజు, హెచ్ఎం వి.అనురాధ, ఉపాధ్యాయులు సిహెచ్.ప్రసాదరావు, పికెడి.రాజ్యలక్ష్మి, పి.సునీత పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయం పరిశీలన

నరసాపురం:జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన టి.రాహుల్ కుమార్‌రెడ్డి నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్‌తో మాట్లాడి సబ్ కలెక్టర్ కార్యాలయ పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం రికార్డ్ రూమ్‌లో పాత ఫైల్స్ అమరికను పరిశీలించి, భద్రతా చర్యలపై ఆరా తీశారు. మీటింగ్ హాలు, వీడియో కాన్ఫరెన్స్ హాలు, కార్యాలయం సిబ్బంది పనిచేసే విభాగాలను ఆయన పరిశీలించి, పిజిఆర్ఎస్ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట కార్యాలయ ఎఒ సిహెచ్ పెద్దిరాజు, తహశీల్దార్ టి.రాజేశ్వరి, కార్యదర్శి సిబ్బంది ఉన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

గణపవరం:ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గణపవరం ప్రాథమిక ఆసుపత్రి హెల్త్ కమ్యూనిటీ అధికారి జాలాది విల్సన్ బాబు అన్నారు. శనివారం వాకపల్లిలో గుడ్ లాంప్ టిఐఎన్‌జిఒ ఆధ్వర్యంలో 14 క్యాంపు వద్ద 'మీకు తెలుసా' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను వివక్షతో చూడకుండా అందరితో కలిసి జీవించే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎయిడ్ యాక్ట్ 2017 టిఆర్‌టి మందులు ఎపి ఎస్ఎసిఎస్ యాప్ టోల్ ఫ్రీ నంబర్ తెలిపారు. కార్యక్రమంలో గుడ్ లాంప్ ప్రాజెక్టు మేనేజర్ వెలగపల్లి టోని సిబ్బంది ఎఎన్ఎంఇ.వరలక్ష్మి, గ్రామ సర్పంచి ఆదిమూలం శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్ పిటి.రూత్ కుమారి ఆరోగ్య కార్యకర్త ఎం.నల్లయ్య, 104 సిబ్బంది పాల్గొన్నారు.

19 నుంచి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ

కాళ్ల:మండలంలోని 21 గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకూ 3 రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ జి.స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాళ్ల మండల పరిషత్‌లో జరగనున్న శిక్షణా తరగతుల్లో రిసోర్స్‌తో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పారదర్శక పాలన అమలు చేయడానికి శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సర్పంచులు, కార్యదర్శులు తప్పక హాజరవ్వాలన్నారు.

నేడు యలమంచిలి మండలంలో మంత్రి నిమ్మల పర్యటన

పాలకొల్లు:రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 18వ తేదీ ఆదివారం యలమంచిలి మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు కాంబోట్లపాలెం గ్రామంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ, రోడ్డు శంకుస్థాపనలో పాల్గొంటారు. అనంతరం గుంపర్రులో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమంలో రామానాయుడు పాల్గొంటారు.

ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

కాళ్ల:ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ ఉద్యోగి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన పెదఅమిరం గ్రామంలో కాళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎ.నందీశ్వరరావు (53) ఉండి తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్నారు. పెదఅమిరం గ్రామా రెవెన్యూ పరిధిలో మెహర్ బాబా స్కూల్ వెనుక వేపచెట్టుకు ఉరివేసుకొని మృతి చెందారు. ఆయన స్వగ్రామం పెనుగొండ మండలం ములపర్రు గ్రామం. ఆయన ఇటీవల విఆర్ఒ నుంచి ఉద్యోన్నతి పొందారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా చనిపోయినట్లు ప్రాథమిక సమాచారం. కాళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వినతుల హోరు.. ఆందోళనల జోరు

కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటింది. కొత్త జిల్లా అధికారులు విధుల్లోకొచ్చి నెల రోజులు దాటింది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ జనం పెద్దఎత్తున మండల, జిల్లా కార్యాలయాల ఎదుట బారులు తీరుతున్నారు.

వినతులిచ్చినా పరిష్కారంకాని తీవ్రమైన సమస్యలపై జనం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు.



టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక స్పందన స్థానంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రారంభించింది. ప్రతి సోమవారమూ జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు. వీటిలో ఎక్కువ భూసమస్యలు, అర్హతున్నా పెన్షన్ రావడం లేదని, వ్యక్తిగత సమస్యలతోపాటు రోడ్డు, తాగునీరు ఇతర అంశాలపై అర్జీలు వస్తున్నాయి. వీటిలో ఆర్థిక సంబంధిత అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుండగా మిగిలిన అర్జీల పరిష్కారానికి జిల్లా ఉన్నతాధికారులు సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తున్నారు. ప్రధానంగా జిల్లా అధికారులు వికలాంగులు, వృద్ధుల వద్దకే వెళ్లి అర్జీలు స్వీకరించడం, సమస్యను ఓపిగ్గా అడిగి తెలుసుకుని పరిష్కారానికి నిర్దిష్ట ఆదేశాలు అక్కడికక్కడే ఇవ్వడంతో జనం కూడా ఒకింత సంతృప్తితో వెనుదిరుగుతున్నారు. అయితే అప్పటికీ పరిష్కారం కాని, జనాన్ని తీవ్రంగా వేధిస్తున్న సమస్యలపై వెంటనే రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నారు. వీటిలో తాగునీరు, రోడ్లు వంటి అంశాలపై జనం రోడ్డెక్కుతున్న పరిస్థితి ఉంది. ఏదేమైనా కొత్త ప్రభుత్వం.. కొత్త అధికారుల నేపథ్యంలో కొద్ది రోజులు వేచిచూడాలనే భావన అర్జీదారుల్లోనూ కన్పిస్తోంది. ఏదేమైనా వినతులు సకాలంలో పరిష్కరిస్తే పాలకులు ప్రజల మనసు గెలుస్తారు. లేనిపక్షంలో జనం ఏదోక రూపంలో రోడ్డెక్కే ప్రమాదముందనే హెచ్చరికలు ఘంటాపథంగా విన్పిస్తున్నాయి.

గత ప్రభుత్వం అమలు చేసిన నూతన విద్యావిధానం దుష్ఫలితాలు మరోసారి తెరపైకొచ్చాయి. జిఒ 117 యథాతథంగా అమలు చేస్తూ ఉపాధ్యాయుల సర్దుబాటుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. ఫ్యాప్టో ఆధ్వర్యాన సర్దుబాటు కౌన్సెలింగ్‌ను బహిష్కరించి నిరసన తెలిపాయి. దీంతో ప్రభుత్వం దిగొచ్చి చర్చలు జరిపి ఉపాధ్యాయుల అభిప్రాయాలను కొన్నింటిని పరిగణనలోకి తీసుకుంది. అదే సమయంలో జిఒ 117 రద్దు అంశాన్ని మాత్రం పక్కన పెట్టింది. అంటే నూతన విద్యావిధానం తీసుకొచ్చిన మోడీ ప్రభుత్వమే కేంద్రంలో అధికారంలో ఉంది. రాష్ట్రంలోనే వైసిపి స్థానంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఫలితంగా నూతన విద్యావిధానం కొనసాగిస్తామని అన్యాపదేశంగా జిఒ 117 అమలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చెప్పకనే చెప్పనట్లయ్యింది. దీన్నిబట్టి ఉద్యోగ, ఉపాధ్యాయులు మరింత అప్రమత్తంగా ఉండాలనేది ప్రభుత్వ విధానం హెచ్చరిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు.

ఇక అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. ఏలూరు జిల్లాలో ఏలూరు, నూజివీడు పట్టణాల్లోనూ, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో ప్రారంభించారు. మరి మిగిలిన పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లోనూ అన్నా క్యాంటీన్లు ప్రారంభించాలని ప్రజాప్రతినిధులపై ఒత్తిడి వస్తోంది. తొలి రోజు పెట్టినంత నాణ్యమైన, రుచికరమైన ఆహారం ప్రతిరోజూ పెట్టాలని జనం కోరుతున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

In the Court of the Hon'ble VIIth Addl. Junior Civil Judge, Rajahmundry
O.S. No. 1005 of 2019
Between:
Yakkala Malleswara Rao, S/o. Veerabhadram, Hindu, aged 47 years, R/o. Door No. 2-77, Veeravaram, Kadiyam Mandal, East Godavari District, A.P. ***...Plaintiff***
AND
Inti Srirama Murthy, S/o. Subba Rao, Hindu, aged 48 years, R/o. Door No. 2-50/1, Duvva Village, Tanuku Mandal, West Godavari District, A.P. ***...Defendant***
Whereas the above named plaintiff filed the above suit for recovery of amount from the defendant. The plaintiff send summons through court and RP but you are not received the same intentionally. The above suit is posted **on 29-08-2024 for your appearance at 10.30 a.m.,** before the said court. Take notice that if you failed to appear before the said court on that day, the matter will be proceeded ex-party in your absence.
KOTHAPALLI SRINIVASU
Advocate, Rajahmundry
Cell: 97052 56019